క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



నస్రుల్లాబాద్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. గురువారం దుర్కిలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ప్రతి గ్రామంలో మంజూరైన ప్రతి ఇల్లు ప్రారంభమవ్వాలని ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్‌ను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి సరిత, లబ్ధిదారులు ఉన్నారు.

దుష్ప్రచారం మానుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్‌లు హితవు పలికారు. గురువారం వజ్జపల్లిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. బినామీ పేర్లమీద బిల్లులు లేపిన చరిత్ర బీఆర్‌ఎస్ నేతలదేనన్నారు. ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, విండో చైర్మన్ గంగాధర్, నాయకులు భూంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, హరీష్ రావు, గాదె చిన్నన్న, అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం గురించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ..రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. విండో ఆవరణలో గ్రామం చిత్రపటాన్ని, వివిధ రకాల పంటల భూముల గురించి వివరించారు. విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు వేయించాలి



బాన్సువాడ రూరల్: ఈ నెల 11న నిర్వహించే జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని హన్మాజీపేట్ పీహెచ్‌సీ వైద్యుడు ఇమ్రాన్ కోరారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద్‌తో కలిసి మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సైన్స్ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. 1నుంచి 19 ఏళ్లలోపు వారందరికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు.

ఉచిత కంటి శిబిరం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో వైద్యులు హరికిషన్ పాల్గొని 48 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మందికి మోతి బిందు ఉన్నట్లు గుర్తించారు. మరో 14 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు.

శేర్‌శంకర్ తండాలో ..

రాజంపేట: శేర్‌శంకర్ తండాలో గురువారం ఎర్రపహాడ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. తండాలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టారు. 40 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సిబ్బంది హనీమేరీ, ఏఎన్ఎం అలేఖ్య, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు లలిత, గంగుబాయి పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహంలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాంబాయి తెలిపారు. 542 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి 104 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరిలో 8 మందికి చర్మ వ్యాధులు దగ్గు, జలుబు ఉన్నట్లు వెల్లడించారు. ఆరోగ్య కార్యకర్త రాజమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తరగతులు ఏడు.. గదులు మూడు

- సిర్‌పూర్ పాఠశాలలో ప్రస్తుత పరిస్థితి
- చెట్ల కింద కొనసాగుతున్న చదువులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఒకే గదిలో రెండు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



సిర్‌పూర్‌లో చెట్ల కింద కూర్చొని చదువుతున్న విద్యార్థులు

మద్నూర్(జుక్కల్): ఆ గ్రామానికి చెందిన వ్యక్తి ఇటీవల పదేళ్లు ఎంపీగా కొనసాగారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని మాటిచ్చారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఆ గ్రామంలో విద్యార్థులు చదువు కోసం కష్టాలు పడుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకునేవారే లేరని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. డొంగ్లీ మండలంలోని మంజీర వాగుకు అనుకొని ఉన్న సిర్‌పూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు కొనసాగుతుంది. మొత్తం 89 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. సిర్‌పూర్ పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైతం ఆరు, ఏడో తరగతి కోసం సిర్‌పూర్‌కు నిత్యం నడుచుకుంటూ వస్తారు. ఆరుగురు ఉపాధ్యాయులు పక్క ఊర్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అంతా బాగున్నా పాఠశాలలో తరగతి గదులు లేకపోవడంతో ఒక్కో గదిలో రెండు, మూడు తరగతులను కలిపి చదువు చెబుతున్నారు. పాఠశాలలో మూడు గదులు మాత్రమే ఉండడం..ఒక్కో గదిలో మూడు తరగతుల విద్యార్థులను కూర్చోబెడుతుండటంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఒక్కో సారి విద్యార్థులకు పాఠశాల ఆవరణలోని చెట్ల కింద తరగతులు కొనసాగిస్తున్నారు. వర్షం కురిస్తే మాత్రం పరిస్థితి చెప్పనవసరం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఒకటి, రెండు, మూడవ తరగతులు ఒక గదిలో, నాలుగు, ఐదు, ఆరవ తరగతులు మరో గదిలో ఇక మిగిలిన ఒక గదిలో ఒక పక్క ఏడో తరగతి మరో పక్క ఆఫీస్ రూం కొనసాగిస్తున్నారు. ఏడో తరగతి గదికి వెంటిలేషన్ లేకపోవడంతో పొద్దంతా చీకటిగా ఉంటుందని, విద్యుత్ సరఫరా నిలిచిపోతే పూర్తిగా చీకటిగా ఉంటుందని వారు అన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే తరగతి మధ్యలోనే ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం కూడా ఆగిపోతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అయితే చదువులు ఎలా కొనసాగుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని, మెరుగైన విద్య అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఈ పాఠశాల పరిస్థితి మాత్రం మారడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం కావడంతో ఆరుబయట కూడా పాఠాలు చెప్పలేని పరిస్థితి ఉందని, దీంతో ఇరుకు గదుల్లోనే బోధన కొనసాగిస్తున్నట్లే ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఒక పక్క ఏడవ తరగతి.. మరోపక్క ఆఫీస్ రూం

చెట్ల కింద చదువుతున్నాం

ఎన్నో ఏళ్లుగా పాఠశాలలో తరగతి గదులు సరిపోక పరేషాన్ అవుతున్నాం. ఒకే గదిలో మూడు తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. లేదంటే చెట్ల కింద పాఠాలు నేర్చుకుంటున్నాం. వర్షం పడితే అందరం ఒకే దగ్గర కూర్చొని పాఠాలు వినాల్సి వస్తోంది.

– అక్షయ్, విద్యార్థి, సిర్‌పూర్

చాలా ఇబ్బందిగా ఉంది

మా పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. కాని ఇక్కడ మాత్రం మూడు గదులు మాత్రమే ఉన్నాయి. ప్రతి రోజు విద్యార్థులకు పాఠాలు బోధించాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు దృష్టి సారిస్తే విద్యార్థుల సమస్య పరిష్కారం అవుతుంది.

– స్వరూపరాణి, ఉపాధ్యాయురాలు, సిర్‌పూర్

ఉన్నతాధికారులకు నివేదించాం

సిర్‌పూర్ పాఠశాలలో మూడు గదులు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడవ తరగతి వరకు 89 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు రైతు కుటుంబం నుంచి వచ్చినవారే. వారికి మంచి చదువు చెప్పాలని సమస్యలు పరిష్కరించాలని వారి విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతూ వస్తున్నారు. అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాస్, ఎంఈవో, డోంగ్లీ మండలం

రక్షా బంధన్ వేడుకలు



గిద్ద పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



భిక్కనూరు సిద్దార్థ పాఠశాలలో..



బోర్లం జెడ్పీహెచ్‌ఎస్‌లో చెట్టుకు రాఖీ కడుదుతున్న విద్యార్థులు



బాన్సువాడలో రాఖీలు విక్రయిస్తున్న వ్యాపారులు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు గురువారం నిర్వహించారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం రావడంతో రెండు రోజులు ముందస్తుగా వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని సంబరాలు జరుపుకున్నారు. నీకు నేను రక్ష, నాకు నీవు రక్ష, మనిద్దరం దేశానికి రక్ష అంటూ నినాదాలు చేశారు. రక్షాబంధన్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించి చెప్పారు. కొన్ని గ్రామాల్లో రాఖీలను ఉచితంగా పంపిణీ చేశారు.



మద్నూర్ ప్రభుత్వ పాఠశాలలో..



ఎల్లారెడ్డిలో రాఖీలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అనుకూలమైన ప్రాంతంలోనే జీపీ భవనాన్ని నిర్మించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండా గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రజలందరికీ అనుకూలమైన ప్రాంతంలోనే నిర్మించాలని కోరుతూ ఎర్రకుంటతాండవాసులు గురువారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు. తమ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంటతండాలో 320 మంది, బెజుగంచెరువు తండాలో 200 మంది జనాభా ఉన్నారని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇరు తండావాసులకు అనుకూలంగా రెండు తండాల మధ్యగల సర్వే నెంబర్-222లో నిర్మించాలని కోరారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు అత్యధిక మార్కులు సాధించాలంటే అధ్యాపకుల కృషితో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

మొక్కలు నాటి రక్షించుకుందాం



బిచ్కుంద(జుక్కల్): ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి రక్షించుకుందామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. వనమహోత్సవం సందర్భంగా కళాశాలలో గురువారం విద్యార్థులు, లెక్చరర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెట్ల ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు.

రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ కాలయాపన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికలను బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఓడిపోతామనే భయంతో ఎన్నికలు నిర్వహించడంలేదన్నారు. ముస్లిం మైనార్టీలను కలపడం వల్ల బీసీలకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్, ఉదయ్‌కుమార్, విష్ణువర్ధన్, అల్లూరి, సాయిలు, గణేష్, చిరంజీవి, మహేష్, అశోక్ పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని ఇతరులకు కేటాయిస్తే ఊరుకోం



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని క్రీడా మైదానాన్ని మహిళా సంఘాలకు కేటాయించవద్దని కోరుతూ గ్రామస్తులు, రైతులు ఆర్ఐ కిరణ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, రైతు వేదిక మధ్యలో ఉన్న ఖాళీ స్థలం గతంలో యువకులకు క్రీడా మైదానం కోసం కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రతి ఏటా రైతులకు కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతులు ధాన్యం ఆరబెట్టుకుంటున్నారని అన్నారు. గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలో ఆ స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా ఏర్పాటు చేసి బోర్డు సైతం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. మహిళా సంఘాల అభివృద్ధి పేరిట యువకులు, రైతులకు అన్యాయం చేయవద్దని సూచించారు. స్థానికులు అశోక్, పోశెట్టి, బైరయ్య, వెంకటేశం, శంకర్‌గౌడ్, నారాయణ, రవి, సాయిరాం, లింగం, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లిలో గురువారం సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి వ్యాధులు సోకకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. జ్వరాలు, ఇతర సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లార్వా, జ్వర సర్వే చేశారు. పలువురి రక్త నమూనాలు సేకరించారు. మురికి నీటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి గోవింద్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు రాంబాయి, సామాజిక ఆరోగ్య అధికారి ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో మురుగునీరు నిల్వ ఉంచొద్దు



బాన్సువాడ రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పొలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్త పడాలని బాన్సువాడ ఏడీఏ అరుణ సూచించారు. గురువారం ఆమె చిన్న రాంపూర్‌లో ఏవో ఫైజుల్లా, ఏఈవో దత్తేశ్వరితో కలిసి క్షేత్ర పర్యటన చేసి పంటపొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరిపైరుకు ఉల్లికోడు తెగులు ఆశిస్తున్నాయని.. నివారణకు ఎకరాకు 80 శాతం 50మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ ద్రావకాన్ని పిచికారీ చేయాలన్నారు. రైతులు మోహన్‌రెడ్డి, పర్వగొండ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు, పీఎంపీలను ప్రభుత్వం గుర్తించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాలలో ఉంటూ ప్రజలకు సేవలు చేసే పీఎంపీలు, ఆర్ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని పీఎంపీలు, ఆర్ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు నిజ్జన విఠల్ కోరారు. తాడ్వాయి మాగార్డెన్‌లో గురువారం పీఎంపీలు, ఆర్ఎంపీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తమకు సహాయ సహకారాలు అందించక పోయినప్పటికీ ప్రజలకు సేవలను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుడికాల చందు, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని సంగయ్య, కోశాధికారిగా కృష్ణ, కార్యదర్శిగా సుభాష్, జిల్లా మెంబర్లుగా రవికుమార్, శ్రీధర్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. జిల్లా ప్రతినిధులు గోపాల్‌రావు, బుచ్చిరెడ్డి, భీంరావు, మాణిక్యం, నర్సింలు, బాన్సువాడ మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ అందించండి

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్



బీబీపేటలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

బీబీపేట: వ్యవసాయానికి 18 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరంగా ఇవ్వాలని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయానికి 13 గంటలు మాత్రమే విద్యుత్‌ను అందిస్తున్నారని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసలే వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల బోరు బావులపైనే ఆధారపడాల్సి వస్తుందని, దీంతో మోటార్లు సైతం కాలిపోతున్నాయని అన్నారు. ఇచ్చే విద్యుత్‌ను సైతం నిరంతరంగా ఇవ్వాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులే తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మాజీ ఎంపీపీ బాలమణి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, గంగాధర్, తదితరులు ఉన్నారు.

‘చేనేత వస్త్రాలు ధరించి అండగా ఉండాలి



నేతకార్మికులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ప్రతి ఒక్కరు కనీసం వారానికి ఒక రోజైనా ఖద్దరు, చేనేత వస్త్రాలు ధరించి నేత కార్మికుల ఉపాధికి అండగా ఉండాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ముస్కు జైపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ గురువారం స్థానిక విద్యానగర్ రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నలుగురు చేనేత కార్మికులను సన్మానించింది. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, సబ్బని కృష్ణహరి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు చాట్ల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం వద్ద గురువారం చేనేత కార్మికుల దినోత్సవాన్ని సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల చేనేత సంఘం అధ్యక్షుడు సనపుల కృష్ణ, ఉపాధ్యక్షుడు లోక శ్రీనివాస్, సభ్యులు చుక్క శీను, సంతోస్, మనోహర్, నర్సింహులు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యపల్లిలో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఎల్లారెడ్డి రూరల్: మల్లయ్యపల్లిలో గురువారం గ్రామసభ నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి రాజయ్య తెలిపారు గ్రామసభలో పారిశుద్ధ్య నిర్వహణ, అంగన్‌వాడి కేంద్రం, ఆరోగ్య వివరాలు, గ్రామ అభివృద్ధి, విద్యుత్ వివరాలు తదితర వాటికి సంబంధించిన వివరాలను గ్రామస్తుల సమక్షంలో చర్చించారు.

పంచాయతి అడ్వాన్స్ ఇండెక్స్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగిందని కార్యదర్శి తెలిపారు. ఉపాధ్యాయులు విశ్వనాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పంట పొలాల పరిశీలన

నస్రుల్లాబాద్: మైలారం శివారు పంట పొలాలను గురువారం మండల వ్యవసాయ అధికారిణి భవాని పరిశీలించారు. పంట పొలాలకు ఆకు ముడత తెగులు, ఉల్లికోడు తెగులు వ్యాపిస్తున్నాయని గమనించామన్నారు. ఆకు ముడత తెగులుకు క్లోరోపైడి ఫాస్ 50 ఈసి 2.5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, ఉల్లి కోడు తెగులుకు ఫిప్రోనిల్ 5 శాతం ఎస్.సీ.2ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పంట పొలాలకు ఎరువులు, పురుగు మందులను ఇష్టానుసారంగా చల్లి నష్టపోవద్దని వ్యవసాయ అధికారుల సలహా మేరకు మందులను వాడాలన్నారు. ఏఈవో గోపాల్, రైతులు ఉన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో గురువారం కామారెడ్డి జిల్లా భారతీయ కిసాన్ సంఘం అధ్యక్షులు విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దకొడప్‌గల్, టికారం తండా గ్రామాల కిసాన్ సంఘం గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దకొడప్‌గల్ గ్రామ అధ్యక్షుడిగా బర్ధావల్ కుమార్ సింగ్, ఉపాధ్యక్షుడిగా మొల్ల అఫ్రోజ్, కార్యదర్శిగా కల్లూరి మహేందర్, టికారం తండా గ్రామ అధ్యక్షుడిగా గోపాల్ సింగ్, నారాయణను ఏకగ్రీవంగా ఎన్నున్నట్లు ఆయన తెలిపారు. సంఘ్ సభ్యులు బోడి రాజు, జక్కుల అంజయ్య, మండల రైతులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



రామారెడ్డి: మండలంలోని రైతు వేదికలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు లక్ష్మాగౌడ్, ప్రవీణ్ గౌడ్, డైరెక్టర్ రవూఫ్, నామాల రవి, బండి ప్రవీణ్, రంగు రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభకు జిల్లా నాయకులు

కామారెడ్డి టౌన్: గోవాలో జరుగుతున్న 10వ జాతీయ ఓబీసీ మహాసభలకు జిల్లా నుంచి నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాగరాజ్ గౌడ్, అజయ్, గోవర్ధన్, దయాకర్, రాజేందర్ తదితరులున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఐఈఆర్‌పీ కమల్ కిషోర్, వైద్యురాలు సారిక, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు, సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.